క్లుప్తంగా

## రెండు రోజులపాటు అన్న క్యాంటీన్ మూత

నెహ్రూనగర్: నగరంలోని 7 అన్న క్యాంటీన్లు శనివారం, ఆదివారాల్లో మూసివేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ బక్రీద్, 8వ తేదీ ఆదివారం వరసగా రావడంతో సెంట్రల్ వంటశాలను శుభ్రపరచడం, సర్వీసింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు క్యాంటీన్లను మూసి వేస్తున్నారని, తిరిగి సోమవారం క్యాంటీన్లు యథావిధిగా అందుబాటులో ఉంటాయన్నారు.

## ధ్వజారోహణ గరుడ ప్రసాద వితరణ



నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలో వేంచేసిన శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి, విశేష పూజలు నిర్వహించారు. అర్చక బృందం వేద మంత్రాలతో రాగ తాళాల సంగీత సమ్మేళనంతో వైనతేయుని, ముక్కోటి దేవతలను ఆహ్వానించి విశేష పూజల అనంతరం ధ్వజారోహణ చేశారు. ప్రత్యేకంగా సంతానార్థులైన మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందించారు. సాయంత్రం శ్రీవెంకటేశ్వర సహస్ర నామ స్తోత్ర పారాయణ, ఎదుర్కోలు సన్నాహం, రాయబారం కనుల పండువగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

## జూలై 23,24 తేదీలలో భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలు

లక్ష్మీపురం: భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు గుంటూరులో జూలై 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తెలిపారు. పాతగుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రమణారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల నిర్వహణకు నగరంలోని ప్రముఖులతో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయడం చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్వీ నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు గుంటూరులో జరుగుతున్నందున ప్రముఖులందరూ సహకరించి మహాసభల జయప్రదానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నరసింహారావు, కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి సుందరబాబు, అనసూయ నగర నాయకులు టజు ఖసీం వాలి, దీవెనరావు, టి.శ్రీను పాల్గొన్నారు.

## ఆయుర్వేదాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రకృతి వైద్య విధానం ఆయుర్వేదం అనేక రుగ్మతలకు చక్కటి పరిష్కారం చూపుతోందని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. శ్రీధరియం ఆయుర్వేదిక్ ఐ క్లినిక్, పంచకర్మ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 8న బ్రాడీపేట 3వ లైనులోని ఆంధ్ర ప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో ఉచిత కంటి, ఇతర సమస్యల పరీక్ష శిబిరం సమాచార పోస్టర్ ను శుక్రవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ పవన్ కుమార్ మాట్లాడారు. వివరాలకు 7034020977, 70340 20877 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల కార్యదర్శి డాక్టర్ మధుసూదన రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామయ్య, హైందవ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు టి.శివశంకర్ పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో కు.ని. ఆపరేషన్లు ఆపలేదు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు(కు.ని.)నిలిపివేసినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిజం కావని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. కుటుంబ నియంత్రణ విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌ను మాత్రమే కోవిడ్ సర్జరీలు చేసేందుకు కేటాయించామన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ థియేటర్‌ను వినియోగిస్తున్నామని చెప్పారు. గైనిక్ వార్డులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ తెలిపారు.

# అజీర్తితో తిప్పలు తప్పవులే..

- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న సమస్యలు
- వేళాపాళా లేకుండా ఆహారం తీసుకోవడంతో అనర్థాలు
- అవగాహనతో జీర్ణకోశ వ్యాధులను కట్టడి చేయవచ్చు
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దరిచేరవు


శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి భోజనానికి దూరమయ్యాడు. రెస్టారెంట్‌లలో తింటున్నాడు. సమయానికి భోజనం చేయకపోవడం, పని ఒత్తిడి పెరిగిపోయింది. కొద్దిరోజులుగా తిన్నది అరగడం లేదు. వైద్యులను సంప్రదించాడు. వేళాపాళా లేకుండా ఆహారం తీసుకోవడం, ఒత్తిడి వలన జీర్ణ ప్రక్రియ మందగించినట్లు వైద్యులు నిర్ధారించారు.

– గుంటూరు మెడికల్

ప్రస్తుతం నగరం, పల్లెటూరు తేడా లేకుండా ఆధునిక జీవన శైలికి అలవాటు పడుతున్నారు. దీని వలన ఎక్కువ మంది జీర్ణక్రియ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. పాఠశాల విద్యార్థులు, కళాశాల యువత, ఉద్యోగాలు చేస్తున్నవారు, వ్యాపారస్తులు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు జీర్ణసంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది జీర్ణ ప్రక్రియ సక్రమంగా పనిచేయక అవస్థలు పడుతున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రతి ఏడాది డైజీస్టీవ్ సమస్యలు పెరిగిపోతున్నాయి. ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి అరికట్టకపోతే పెద్దపేగు క్యాన్సర్‌కు దారితీయవచ్చు.

**అరగకపోతే సమస్యలు**

జీర్ణ సంబంధిత సమస్యలు ఎక్కువగా మనం తీసుకునే ఆహారం సరైన పద్ధతిలో తీసుకోకపోవడం వలన వస్తున్నాయి. తిన్న ఆహారం సక్రమంగా జీర్ణం అవకపోవడం కూడా వ్యాధులు రావడానికి కారణమవుతోంది. తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణమైనప్పుడే శరీరంలోని వివిధ అవయవాలకు శక్తి లభిస్తోంది.



జీర్ణ వ్యవస్థ మనం తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేసి అందులోని పోషకాలను రక్తంలోకి చేరుస్తోంది. రక్తం నుంచి కాలేయానికి అక్కడి నుంచి పోషకాలు శరీరంలోని వివిధ అవయవాలకు చేరడం ద్వారా మనిషికి శక్తి లభిస్తోంది. యాంత్రిక జీవనం వల్ల హడావుడిగా ఆహారం తీసుకోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, నిర్ణీత ఆహార వేళలు పాటించకుండా మసాలా దినుసులతో కూడిన ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి.

**పెరుగుతున్న వ్యాధులు**

జీర్ణక్రియ సంబంధిత వ్యాధులు ఆధునిక జీవన శైలి వల్ల పెరుగుతున్నాయి. ఇంట్లో ఆహారం తయారు చేసుకుని తినకుండా ఎక్కువ శాతం హోటళ్లలో తినడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయి. ఉద్యోగరీత్యా, చదువులు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలతో ఎక్కువగా ఒత్తిడికి లోనవడం ద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

**పెద్దపేగు క్యాన్సర్‌కు దారి..**

జీర్ణకోశ సంబంధిత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయకపోవడం ద్వారా అవి పెద్ద పేగు క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయి. పెద్దపేగు క్యాన్సర్ సోకిన వారిలో ప్రాథమిక దశలో పొట్టకింద నొప్పి, పొట్టబిగపట్టడం, మలవిసర్జన సమయంలో నొప్పి, మలద్వారం నుంచి రక్తస్రావం అవడం, కొన్ని సార్లు ఎక్కువగా విరోచనాలు అవడం, బరువు తగ్గిపోవడం, అలసట, తదితర సమస్యలు కనిపిస్తాయి.

**ముందస్తు జాగ్రత్తలతో కట్టడి చేయవచ్చు**



ఆహారం తిన్నవెంటనే ఎట్టిపరిస్థితుల్లోనూ నిద్రకు ఉపక్రమించకూడదు. సాధ్యమైంత మేర రాత్రి వేళల్లో త్వరంగా 9 గంటల్లోపు భోజనం చేయాలి. భోజనం చేసిన అనంతరం కొంతసేపు నడవడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతోంది. ఒత్తిడి, ఆందోళన లేకుండా యోగా, నడక, కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. జీర్ణ వ్యవస్థకు హానికలిగించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, గుంటూరు

**జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు**

జీజీహెచ్‌లో జీర్ణకోశ సంబంధిత సమస్యల బాధితులకు ఉచితంగా అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతిరోజూ 300 మంది వివిధ రకాల సమస్యలతో వైద్యం కోసం వస్తున్నారు. జీర్ణకోశ సంబంధిత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయవచ్చని గ్యాస్ట్రో ఎంట్రాలజీస్టులు తెలియజేస్తున్నారు. జీజీహెచ్‌లో జీర్ణకోశ సంబంధిత సమస్యలకు కార్పొరేట్ ఆసుపత్రుల కంటే ధీటుగా ఆపరేషన్‌లు కూడా ఉచితంగా చేస్తున్నారు. గత ఏడాది గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో ఓపీ విభాగంలో 5,250 మంది, ఈఏడాది జనవరి నుంచి మే వరకు 2,890 మంది చికిత్స పొందారు.

## అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు సర్వీసు

పట్నంబజారు: ఈ నెల 11వ తేదీన పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం వెళ్లే శివ భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన బయలుదేరి 10వ తేదీన కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని, అదే రోజు రాత్రి అక్కడకు చేరుకుంటామని తెలిపారు. 11వ తేదీ గిరి ప్రదక్షిణ, స్వామి దర్శనం చేసుకున్న అనంతరం సాయంత్రం బస్సు బయలుదేరి 12వ తేదీ గుంటూరు చేరుకుంటుందని వివరించారు. బస్సులో టికెట్‌ల కోసం 96164 సర్వీస్‌లు ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని తెలిపారు. ఒక్కొక్క టికెట్ ధర రూ.2,420 ఉంటుందని పేర్కొన్నారు. వివరాల కోసం 7382897459, 7382896403కు సంప్రదించాలని కోరారు.

## ప్రజలు చేతి సంచులను వాడాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా రూ.20కే నాణ్యమైన గుడ్డ సంచులను అందించేలా ప్రత్యేకంగా వెండింగ్ మెషిన్లను అందుబాటులోకి తెచ్చామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం గాంధీ పార్క్ దగ్గర ఏర్పాటు చేసిన గుడ్డ సంచుల వెండింగ్ మెషిన్, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ పాయింట్‌లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లల్లో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను కేజీ ఇస్తే గాంధీ పార్క్‌లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని చెప్పారు. పర్యావరణ హిత, క్లీన్ గుంటూరు సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు గాంధీ పార్క్ దగ్గర ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు.

## చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి



లక్ష్మీపురం: స్వాతంత్ర్య సమరయోధులు, సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి చంద్ర రాజేశ్వరరావు జయంతి శుక్రవారం నిర్వహించారు. నగరంలోని కృష్ణా నగర్‌లోని చంద్ర రాజేశ్వరరావు పార్కులో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్వాతంత్ర్య పోరాటానికి అంకితమై, స్వరాజ్య సాధనకే కాక, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. ఆయన ప్రజల పక్షాన సాగించిన భూ సంగ్రామం మనకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి ప్రసంగించారు. కార్యక్రమంలో ఐపీటీఏ జాతీయ కార్యదర్శి గని, పర్యావరణ ఉద్యమకారుడు రత్నాకర్ రావు, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్ పాల్గొని నివాళులర్పించారు.

## వివాహిత అదృశ్యం

లక్ష్మీపురం: వివాహిత అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ జమీర్ ఆటో వేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటాడు. రజియాతో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు సంతానం. రజియా గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి మళ్లీ తిరిగి రాకపోవడంతో భర్త రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# ముస్తాబైన మసీదులు, ఈద్గాలు..



విద్యుత్ అలంకరణలో నల్లచెరువు మొహియుద్దీన్‌పాలెం మసీదు

లక్ష్మీపురం: బక్రీద్‌కు మసీదులు, ఈద్గాలు ముస్తాబు అయ్యాయి. నగరంలోని నగరంపాలెం, ముస్లిం కళాశాల వంటి ప్రాంతల వద్ద ఈద్గాలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రార్థనకు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణతో మసీదులు ముస్తాబు చేశారు. నగరంపాలెం ఈద్గాలో 9 గంటలకు నమాజ్, ముస్లిం కళాశాల ఈద్గాలో 09.30 గంటలకు ప్రత్యేక నమాజ్‌లు చేస్తారు.

**బక్రీద్ సందడి**

మార్కెట్‌లో బక్రీద్ సందడి మొదలైంది. నల్లపాడు మండిలో క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు తెలంగాణ, కృష్ణాజిల్లా, వంటి ప్రాంతాల నుంచి పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చున్నారు. మరి కొందరు తమ సమీప ప్రాంతాలైన నల్లపాడు గొర్రెల మండి నుంచి కొనుగోలు చేశారు. స్థానికంగా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. పొట్టేలు ధర రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

**ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ..**



బక్రీద్ పండుగ ఈదుల్ జుహా అనేది మనిషి త్యాగ నిరతిని చాటి చెప్పే పండుగ. ఇస్లాంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో ఒకటైన హజ్ తీర్థ యాత్రను కూడా ముస్లింలు ఈ నెల ప్రారంభంలోనే చేస్తారు. ఒక్కసారైనా అతి పవిత్రమైన మక్కాను ఈనెలలోనే సందర్శించి హజ్ చేసి ముక్తిని పొందాలి. ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ.

–ముఫ్తి సమీయుజమా హబీబీ, ముస్లిం మత గురువు

# ఆశీలు వసూలు టెండర్ రద్దు

- నగరం అంతా తోపుడు బండ్ల వద్ద రుసుం వసూలు చేస్తున్న కాంట్రాక్టర్
- స్పందించిన కమిషనర్ విచారణ చేపట్టి చర్యలు
- ఆశీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని సూచన

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని సంద్రీస్ మార్కెట్ పరిధిలో చెత్త ఆస్కారం లేకుండా, ఉత్పన్నమయ్యే చెత్తను తరలించేందుకు పండ్ల వ్యాపారుల నుంచి రుసుం(ఆశీలు) వసూలు చేసే కాంట్రాక్టర్ తన పరిధి దాటి నగరంలోని వివిధ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, వీధి వ్యాపారుల వద్ద నుంచి రుసుం వసూలు చేస్తున్న విషయంపై 'సాక్షి'లో ఇటీవల 'కూటమి ప్రైవేట్ దోపిడీ'పై కథనం ప్రచురితమైంది. దీంతో టెండర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సదరు టెండర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పండ్ల దిగుమతి వ్యాపారులు ఆశీలు రుసుంను నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బందికే చెల్లించాలని, అదే విధంగా నగరంలో తోపుడు బండ్ల వారు ఎవ్వరికీ ఆశీలు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సదరు కాంట్రాక్టర్ గుంటూరు నగరపాలక సంస్థ 2025–26 సంవత్సరం గెజిట్ నిబంధనల మేరకు నిర్దేశిత అమౌంట్‌కి సంబంధించి ముందస్తు చెల్లుబాటు అయ్యే చెక్‌లను, లీజు అగ్రిమెంట్ రిజిస్టర్ చేయించి జీఎంసీకి అందించనందున వారికి కేటాయించిన రుసుం వసూళ్ల చేసుకునే హక్కును ఈ నెల 4వ తేదీ నుంచి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో తోపుడు బండ్ల వారు ఎవ్వరికీ ఆశీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా వసూలు చేస్తే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103కి ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం అన్యాయం

ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంగా శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

లక్ష్మీపురం: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మంగా శ్రీనివాస్ మండిపడ్డారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో మల్లయ్య లింగం భవన్‌లో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర వివిధ ఆటో స్టాండ్‌ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని, సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం చేస్తానని, 21, 31 జీవోలను రద్దు చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చెందారు. తక్షణమే ఉచిత బస్సు హామీని విరమించుకోవాలని ఉచిత బస్సు వలన కొన్ని లక్షల ఆటో కార్మికులు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడతాయని గుర్తు చేశారు. గుంటూరు జిల్లాలో బాగా పెరిగినాయని ఈ ఆటోలకు గ్యాస్ నింపుకోవడానికి గ్యాస్ కేంద్రాలు మూడు మాత్రమే ఉన్నాయని వీటిని రెట్టింపుగా పెంచాలని కోరారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు ఎండీ బాబర్, యూనియన్ నాయకులు ఎస్కే గఫర్ పాల్గొన్నారు.

# అనధికారంగా ట్యాంకర్లు తరలించే వారిపై వేటు

- ఏఈ రవికిరణ్ సరెండర్
- ఇద్దరు రిజర్వాయర్ సిబ్బందిని విధుల నుంచి తొలగించిన కమిషనర్



బీఆర్ స్టేడియంలో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ తాగునీటి సరఫరాలో ఇంజినీరింగ్ సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అనధికారికంగా తాగునీటిని ట్యాంకర్ల ద్వారా తరలించడం గమనించి, గతంలో హెచ్చరించిన పర్యవేక్షణ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఏఈ రవి కిరణ్‌ని సరెండర్ చేయాలని, రిజర్వాయర్ సిబ్బంది శేషయ్య, నాగరాజులను విధుల నుంచి తొలగించాలని ఎస్ఈని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ తాగునీటి సరఫరా అనధికార తరలింపుపై తమకు అందిన ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా బీఆర్ స్టేడియం రిజర్వాయర్‌ను తనిఖీ చేశారు. ట్యాంకర్ల వివరాలు నమోదు రిజిస్టర్‌ని పరిశీలించి, రిజిస్టర్‌లో వివరాలకు, నీటిని తరలిస్తున్న ట్యాంకర్ల వివరాలకు వ్యత్యాసం ఉండడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు రిజర్వాయర్‌లో అనధికార నీటి తరలింపుపై గతంలో కూడా అందిన ఫిర్యాదుల మేరకు విధుల్లో సక్రమంగా ఉండాలని హెచ్చరించిన పని తీరు మార్చుకోని ఏఈని తన మాతృ శాఖకు సరెండర్ చేయాలని, సిబ్బందిని అప్కాస్ నుంచి పూర్తిగా తొలగించాలని ఎస్ఈకి సూచించారు. నగరంలో రోజువారీ పర్యటనల్లో రిజర్వాయర్ తనిఖీలు చేస్తామని, తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించి, తాగునీటి సరఫరాపై గత పర్యటనలో ఇచ్చిన ఆదేశాలను పాటించని ఇంజినీరింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణం సదరు ప్రాంతానికి నీటి సరఫరా సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గడ్డిపాడు ఇన్నర్ రింగ్ రోడ్‌లో ఆర్ఓబీ మంజూరు దృష్ట్యా, పనులు ప్రారంభమైతే ప్రత్యామ్నాయంగా వెనిగండ్ల, ఆటో నగర్ రోడ్లను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్వీఎన్ కాలనీలో పలు ప్రాంతాల్లో చేపట్టిన రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాం ప్రసాద్, షేక్ మీరావలి, డీఈఈలు నాగభూషణం, రమేష్ బాబు, ఎస్ఎస్‌లు సోమశేఖర్, ఎస్వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులతో సుబ్బరత్నమ్మ, కన్న మాస్టారు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజు అందాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, డ్రామా స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ ,చెస్, క్యారమ్స్, క్విజ్ అంశాల్లో నిర్వహించిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు, గుళ్లపల్లి ట్రస్టు ప్రతినిధి గుల్లపల్లి సుబ్బారావు, గుళ్లపల్లి వీబీ ప్రసాద్ లింగం, కేవీ రమణ, ఏవీకే సూజాత, ఉప గ్రంథపాలకురాలు కె.జాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

**గార్డెన్స్ గ్రంథాలయంలో...**

బృందావన్ గార్డెన్స్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో శిక్షణ పొంది, వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు బి.శకుంతల ఎం.సత్య శిరీష, ఎం.అరవింద, పి.సత్యశిరిష, గ్రంథాలయ సిబ్బంది పి.కోటేశ్వరి, పి. సుధాకర్, లక్ష్మి పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ




శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

లక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక చట్టాలలో మార్పులు చేసింది, ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా శుక్రవారం శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పని గంటలు 8 గంటలను 10 గంటలకు పెంచటం అన్యాయమని చెప్పారు. గత 15 సంవత్సరాలుగా షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు సవరించలేదని, కార్మిక సంక్షేమ బోర్డుకు చైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదని, మరోపక్క , మహిళా కార్మికులతో పని చేయించుకునేవిధంగా మార్పు చేయటం, ఓవర్ టైమ్‌ను పెంచటం వంటి మార్పులను కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని విమర్శించారు. ఇప్పటికే మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోగా, రాత్రిపూట పనులు చేయిస్తే మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే కార్మికవర్గం వీధిపోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటెటివ్స్ యూనియన్ నాయకులు షేక్ అబ్దుల్ సలీం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నగర కార్యదర్శి ఎ. కళ్యాణి, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.రమణ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు బి. సత్యనారాయణ, నగర పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, గండికోట శంకరరావు, షేక్ ఖాశీం వలి, షేక్ బాషా, పూనేపల్లి శ్రీనివాసరావు, షేక్ రెహమాన్, జి.శ్రీనివాసరావు, ఫణి, జానీ పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనం



మాట్లాడుతున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీత 15వ అధ్యాయం పురుషోత్తమప్రాప్తియోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం శుక్రవారం ముగిసింది. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయామిషన్ బ్రహ్మచారి సువీరానంద స్వామి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో బండ్లమూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యతో మంచి భవిష్యత్

తెనాలిఅర్బన్: సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఐటీఐ ప్రవేశాల కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చదివేందుకు 298 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీరందరి మెరిట్ ఆధారంగా ఆయా ట్రేడ్‌లో అడ్మిషన్లు ఇచ్చినట్లు చెప్పారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు వెస్ట్)

9912220356

Office mail : sakshigntadvt@gmail.com